# ఎలక్టోరల్ బాండ్లు

# సమస్త దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుంభకోణం

ప్రొ॥ తోట జ్యోతిరాణి

**సుప్రీంకోర్టు** ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నాయకత్వంలో ఐదుగురు జడ్జీలతో ఏర్పడిన ధర్మాసనం 2024, ఫిబ్రవరి 15న ఎలక్టోరల్ బాండ్ వ్యవస్థను రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించి, రద్దు చేసింది. ఎలక్టోరల్ బాండ్ల దాతల, గ్రహీతల వివరాలను 2024 మార్చి 6 లోగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎలక్షన్ కమీషన్‌కు అందజేయాలని, ఈ సమాచారాన్ని ఇసిఐ తన అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించింది. 2019 ఏప్రిల్ 12 నుండి 2024 జనవరి 24 వరకు నగదుగా మార్చుకున్న అన్ని బాండ్ల వివరాలను ఈసిఐ అధికారిక వెబ్‌సైట్‌లో 2024 మార్చి 15న పెట్టడంతో ఈ సమాచారమంతా ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రజల, ప్రజాసంఘాల, వామపక్షాల వ్యతిరేకత, ప్రతిఘటన సుప్రీంకోర్టులో కేసులతో ఛాలెంజ్‌ల మధ్య 2018 జనవరి నుండి ఎలక్టోరల్ బాండ్ల వ్యవస్థను ప్రభుత్వం మొండిగా అమలు చేస్తున్నది.

ఎన్నికల వ్యవస్థ మంచిచెడుల చుట్టూ మాత్రమే చర్చించుకుంటే ఎలక్టోరల్ బాండ్స్ అసలు ఉద్దేశ్యం అర్థంకాదు. మొదటి నుంచి ఎన్నికల విరాళాల సేకరణలో పారదర్శకత అనేదే పెద్ద అబద్ధం. ఎలక్టోరల్ బాండ్లను పారదర్శకత కోసమే అని బిజెపి ప్రభుత్వం బుకాయిస్తున్నది. ఈ పథకం వల్ల నల్లధనం వ్యవస్థీకృతంగా చట్టబద్ధమవుతున్నదని, ప్రపంచంలోనే ఇది అతి పెద్ద కుంభకోణం (scam) అని చెబుతూ, ప్రజాస్వామిక సంఘాలు సాక్ష్యాధారాలతో సమాచారాన్ని బయటపెడుతున్నాయి. చిన్న చిన్న అవినీతికి వ్యతిరేకం అంటూ అతిపెద్ద అవినీతి వ్యవస్థను ప్రారంభించారని రుజువులు చూపించారు. అయినప్పటికీ ఎన్నికల విరాళాలలో నల్లధనాన్ని నిర్మూలించడానికే ఈ పథకం అని చెబుతూ, ఎలక్టోరల్ బాండ్ల రద్దు గురించి సుప్రీంకోర్టు పునరాలోచించాలని ప్రభుత్వం డిమాండ్ చేయటం ఆందోళనకరమే. సంపద భారీ స్థాయిలో పోగుపడిన స్వదేశీ, విదేశీ గుత్త సంస్థల నుండి తీవ్రంగా పెరుగుతున్న ఎన్నికల వ్యయానికి అధికార పార్టీకి నిధులు వస్తున్నాయి. ఆ నిధులతో సామ్రాజ్యవాదులకు సేవ చేసే దళారీ ప్రభుత్వాలు తిరిగి ఏర్పడుతున్నాయి. కార్పొరేట్‌శక్తుల ఆధిపత్యం కోసం, వారి ప్రయోజనాల కోసం పార్లమెంటు, అసెంబ్లీలలో ప్రజా వ్యతిరేక విధానాలను రూపొందిస్తున్నాయి, అమలు చేస్తున్నాయి. సమస్త దేశ సంపదను గుత్త పెట్టుబడులకు అప్పచెబుతున్నాయి. ఈ క్రమంలోనే మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతున్నది. ఈ స్థాయిలో ఎలక్టోరల్ బాండ్స్ మోసాన్ని అర్థం చేసుకోవాలి.

2017-18 కేంద్ర బడ్జెటులో ప్రకటించిన ఎలక్టోరల్ బాండ్లు 2018 జనవరి నుండి అమలులోకి వచ్చాయి. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ADR) అధ్యయనం ప్రకారం 2018 నవంబర్ నాటికి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమకూరిన విరాళాలు 16,710 కోట్ల రూపాయలు. ఇందులో 90 శాతం అధికార పార్టీ బిజెపికే వచ్చాయి. ఎన్నికలలో చట్ట పరిమితులను అధిగమించి, అంటే విచ్చలవిడిగా ఖర్చు చేయడం, గెలవడానికి తప్పనిసరయింది. చట్టాన్ని కాపాడటానికి చట్ట ఉల్లంఘనతోనే అధికారంలోకి రావడం అన్నమాట. దీనినే ప్రజాస్వామ్యం అనటం ఎంత దుర్మార్గమో అందరికీ తెలిసిందే.

2014 ఎన్నికల వ్యయంతో పోలిస్తే 2019లో జాతీయ ఎన్నికల వ్యయం రెండు రెట్లు అధికంగా వుంది. '8.6 బిలియన్ల అమెరికన్ డాలర్ల మేరకు ఎన్నికల ఖర్చుతో, ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికలు ఇవి' అని ఢిల్లీ బేస్డ్ సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అంచనా వేసింది. భారీ ఎన్నికల వ్యయంతో, భారీ మెజారిటీతో అధికారంలోకి బిజెపి పార్టీ వచ్చింది. మళ్లీ అధికారంలోకి రావటానికి పెద్ద మొత్తంలో ఎన్నికల విరాళాలు తప్పనిసరి. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం పనిచేసే ప్రభుత్వాలకు కార్పొరేట్ శక్తులే భారీ మొత్తంలో విరాళాలు ఇస్తాయి. తమకు అనుకూలమైన పాలక పార్టీని గెలిపించు కుంటాయి. దళారీ ప్రభుత్వాలు ఈ విధంగా ఏర్పడతాయి. ఈ క్రమంలోనే పారదర్శకత, నల్లధనాన్ని నిర్మూలించటం పేరిట ఎలక్టోరల్ బాండ్స్ ఉనికిలోకి వచ్చాయి. ఎవరు, ఎవరెవరికి ఎంతిచ్చారో, పరస్పర ప్రయోజనాలు ఏమిటో, సమస్త దేశ సంపద ఏఏ రూపాలలో గుత్త పెట్టుబడులకు బదిలీ అవుతున్నదో ప్రజలకు, ప్రతిపక్షాలకు సమాచారం లేకుండా వుండే చట్రంలో ఎలక్టోరల్ బాండ్ల పథకం రూపొందింది.

## ఎలక్టోరల్ బాండ్ల పథకం :

2017-18 కేంద్ర బడ్జెటులో ప్రకటించిన ఈ పథకం 2018 జనవరి నుండే అమలైంది. నగదు విరాళాలు నల్లధనాన్ని అధికం చేస్తాయని, నగదు విరాళాలను 20,000 రూ.ల నుండి 2000 రూ.లకు తగ్గించారు. వ్యక్తి గాని, సంస్థ గాని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి ఎలక్టోరల్ బాండ్లను కొనవచ్చు. ఈ బాండ్లకు వడ్డీ లేదు, పన్ను లేదు. కొనుగోలు చేసిన బాండ్లను తమకు నచ్చిన రాజకీయ పార్టీకి ఇవ్వవచ్చు. ఏ పార్టీకి ఎంతిచ్చారో గోప్యంగా వుంటుంది. అట్లా కాని పక్షంలో విరాళాల దాత బలిపశువవుతారు. రహస్యంగా విరాళాలను ఇవ్వటం సీక్రెట్

బ్యాలెట్‌తో సమానం అని ప్రభుత్వం అంటున్నది. సమాచార హక్కు నిరపేక్షమైనది కాదు అని చెబుతుంది. విరాళాలు ఇచ్చిన కార్పొరేట్ శక్తుల జీవించే హక్కుని రక్షించడానికి RTI చట్టంలోని 8(1) సెక్షన్ ను సవరించింది. దాతల విరాళాలు, ఎస్బిఐ ద్వారా ప్రభుత్వానికి తెలుస్తాయి. గోప్యత కేవలం ప్రజలకు, ప్రతిపక్షాలకే.

పారదర్శకతనే ఈ పథకానికి లక్ష్యం అని చెబుతున్న ప్రభుత్వం, ఈ బిల్లును ద్రవ్యబిల్లుగా చూపించింది. అందువల్ల రాజ్యసభలో ప్రవేశపెట్టకుండా నివారించింది. అనేక పార్లమెంటు నిబంధనలను, ప్రత్యేకించి భారత రాజ్యాంగంలోని 110వ ఆర్టికల్‌ను ఉల్లంఘించింది. అంతేకాకుండా, ఆర్‌బిఐ చట్టం, 1934లోని సెక్షన్ 31ని సవరించి, ఇందులో క్లాజ్ 3ను అదనంగా చేర్చింది. దీనితో ఎలక్టోరల్ బాండ్లను జారీ చేయమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించే అధికారం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి కేంద్ర ప్రభుత్వానికి బదిలీ అయింది. కంపెనీ చట్టం, 2013 లోని సెక్షన్ 182ను సవరించడం వల్ల 1. విరాళాలను ఇచ్చే కంపెనీ కనీసం మూడు సంవత్సరాల నుండి ఉనికిలో వుండాలి. 2. గత మూడు సంవత్సరాల్లో వచ్చిన సగటు లాభాలలో 7.5 శాతానికి మించకుండా విరాళాలను ఇవ్వవచ్చు. 3. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల అనుమతితో విరాళాలను ఇవ్వాలి. 4. విరాళాలను కంపెనీలు తమ అకౌంట్లో ప్రకటించాలి మొదలగు నిబంధనలన్నీ తొలగిపోయినాయి. కార్పొరేట్ శక్తులు ఎటువంటి పరిమితి లేకుండా, కంపెనీ వాటాదార్లకు ఎటువంటి జవాబుదారీ కాకుండా, రాజకీయపార్టీలకు విరాళాలనివ్వవచ్చు.

FCRA చట్టంలోని సెక్షన్ 2(1) (i)(vi) లను సవరించారు. దీనితో భారతీయ కంపెనీలలో మెజారిటీ వాటాలు వున్న విదేశీ కంపెనీలు రాజకీయ పార్టీలకు విరాళాలనివ్వవచ్చు. అందువల్లనే అనేక పరిశ్రమలు, రంగాలలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం గత పది సంవత్సరాలలో ముమ్మరమైంది. ఈ విధంగా స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడుల నుండి అపరిమితంగా, గోప్యంగా రాజకీయ పార్టీలకు విరాళాలనివ్వటానికి చట్టాలను సవరించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29-C ని సవరించారు. దీనివల్ల రాజకీయ పార్టీలు తమకు వచ్చిన విరాళాలను ఎలక్షన్ కమీషన్‌కు చెప్పనవసరం లేదు. ఇన్‌కం టాక్స్ యాక్ట్, 1961లోని సెక్షన్ 13 A ను సవరించడం వల్ల విరాళాల వివరాలకు సంబంధించిన ఏ రికార్డునూ రాజకీయ పార్టీలు నిర్వహించాల్సిన అవసరం లేదు. ఎలక్టోరల్ బాండ్ల రద్దుతో పాటు ఈ చట్ట సవరణలన్నిటినీ సుప్రీంకోర్టు రద్దుచేసింది.

**ఎలక్టోరల్ బాండ్లు – అధికార పాలక పార్టీ :**

ADR అధ్యయనం ప్రకారం 2018 నుండి 2023 మధ్యకాలంలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమకూరిన విరాళాలు 13,792 కోట్ల రూ.లు. ఇందులో 94 శాతం, కోటి రూపాయల విలువ గల బాండ్లు. అంటే, ఇవన్నీ కార్పొరేట్ శక్తుల విరాళాలే. అదేవిధంగా కేవలం 2019-20లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన విరాళాలు 3,429 కోట్ల రూ.లలో 76 శాతం అంటే 2,606 కోట్ల రూ.లు బిజెపికే వచ్చాయి. ఇదే సంవత్సరం తెలియని మూలాల (Unknown sources) నుండి వచ్చిన రాజకీయ విరాళాలు 2,642.03 కోట్ల రూ.లు. ఇందులో బిజెపి వాటా 78.24 శాతం. ఏప్రిల్ 2019 నుండి 2024లో రద్దయ్యే నాటి వరకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన విరాళాలు 22,217 కోట్ల రూ.లు. ఇందులో 52 శాతానికి పైగా అధికార పాలక పార్టీ బిజెపికే రావటం గుర్తించవలసిన విషయం. ఈ వివరాలన్నీ ప్రభుత్వం, కార్పొరేట్ శక్తుల మధ్య గల పరస్పర ప్రయోజనాలను వెల్లడి చేస్తాయి. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలియటం ప్రమాదం అని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్, ది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, అసోచామ్ మొదలైన సంస్థలు ఈ వివరాలు బయట పెట్టాలన్న ఆదేశాన్ని ఎలక్షన్ కమీషన్‌కు సుప్రీంకోర్టు ఇవ్వవద్దని అడిగాయి.

ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వటానికి మూడు రోజుల ముందు ఆర్థిక మంత్రిత్వశాఖ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఒక కోటి రూపాయల విలువ గల పదివేల బాండ్లను ముద్రించమని ఆదేశించింది. తీర్పు వెలువడిన రెండు వారాల తర్వాత ముద్రణను నిలిపివేయమన్నది. ప్రారంభం నుండి ఎలక్టోరల్ బాండ్ల నిర్వహణ వ్యయభారం పన్నుల రూపంలో ప్రజల మీదనే.

**ఎలక్టోరల్ బాండ్లు – డొల్ల కంపెనీలు – మనీ లాండరింగ్:**

ఎలక్టోరల్ బాండ్లను ఎవరైనా, ఎవరి తరపునైనా కొనుగోలు చేయవచ్చు. బాండ్ల కొనుగోలుదారుడే దాత కాకపోవచ్చు. ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు కోసమే బడా కార్పొరేట్ సంస్థల యొక్క అనుబంధంగా డొల్ల కంపెనీలు ఏర్పడతాయి. నల్లధనం చట్టబద్ధం అవుతుంది. మనీ లాండరింగ్ విశృంఖలమవుతుంది. హిందూ దినపత్రిక, స్వతంత్ర పరిశోధక గ్రూపు సంయుక్తంగా చేసిన విశ్లేషణ ఈ అంశాన్ని స్పష్టంచేస్తున్నది. 2016-17 నుండి 2022-23 వరకు 33 కంపెనీల సమిష్టి నికర నష్టాలు లక్ష కోట్ల రూపాయల పైననే. అయినా ఇవి 576.2 కోట్ల రూ॥ల ఎలక్టోరల్ బాండ్లను కొన్నాయి. ఇందులో బిజెపి వాటా 75 శాతం. ఇది మనీ లాండరింగ్ కాదా?! ఇదే కాలంలో తమ లాభాల కంటే చాలా ఎక్కువ 646 కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లను ఆరు కంపెనీలు కొన్నాయి. ఈ కంపెనీలన్నీ బడా కార్పొరేట్ సంస్థలకు చెందిన డొల్ల కంపెనీలని స్పష్టమవుతుంది. ఈ విరాళాలలో బిజెపి వాటా 93 శాతం. ప్రారంభమైన కొన్ని నెలలకే కొన్ని కంపెనీలు బాండ్లను కొన్నాయి. ఇది ఎలా సాధ్యం? నిజానికి ఈ పథకం మనీ లాండరింగ్‌ని పెంచి పోషిస్తుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ మనీ లాండరింగ్ దృష్ట్యా ప్రమాదకరంగా వున్న 19 కంపెనీలను గుర్తించింది. ఈ కంపెనీలన్నీ కలిసి 2,717 కోట్ల రూ॥ల ఎలక్టోరల్ బాండ్లను కొన్నాయి. ఫలితంగా 18 కంపెనీలు హై రిస్కు కంపెనీల జాబితా నుండి తొలగించ

బద్దాయి. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ప్రభుత్వమే స్వయంగా మనీ లాండరింగ్‌ను బలోపేతం చేస్తున్న విషయం దీనితో స్పష్టమవుతున్నది.

**ఎలక్టోరల్ బాండ్లు- ప్రభుత్వ విధానాలు – సమస్త దేశ సంపదను గుత్త పెట్టుబడులకు స్వాధీనం చేయటం :**

కార్పొరేట్ శక్తుల ప్రయోజనం కోసమే ప్రభుత్వం పని చేస్తున్నది. వాణిజ్య సౌలభ్యం పేరిట ప్రకటిస్తున్న విధానాలు, చట్టాల రద్దు, సవరణలన్నింటి లక్ష్యం ఇదే. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ప్రకటించిన 2017-18 కేంద్ర బడ్జెటులోనే కార్పొరేట్ పన్నును 35 శాతం నుండి 23 శాతానికి తగ్గించారు. ఇందువల్ల కేవలం 2019-20, 2020-21 సం॥లలో కోల్పోయిన పన్ను రాబడి 6.27 లక్షల కోట్ల రూ॥లు. దీన్ని పూరించుకోవడానికి వస్తు సేవల పన్నును అట్టడుగు వర్గాలు, మధ్యతరగతి వర్గాల నుండి వసూలు చేస్తారు. పబ్లిక్ రంగ సంస్థలను చౌక ధరలకు ప్రైవేటీకరిస్తారు. ఖనిజాలను, బొగ్గును, సమస్త రవాణా రంగాన్ని, చివరాఖరుకు అంతరిక్షాన్ని కూడా కార్పొరేట్ సంస్థలకు అప్పచెబుతారు. ఆస్తుల నగదీకరణను అమలు చేస్తారు. నల్ల రైతు చట్టాలను రూపొందిస్తారు. ఇందుకు గుత్త పెట్టుబడిదారులకు తమ కోసమే పనిచేసే ప్రభుత్వాలు కావాలి. అందుకోసం ఎన్నికల విరాళాలు భారీ మొత్తంలో ఇచ్చి, తమకు అనుకూలమైన పాలక పార్టీని గెలిపించుకుంటాయి. ఈ లక్ష్య సాధన కోసం రూపొందిన ఆర్థిక సాధనమే ఎలక్టోరల్ బాండ్స్.

విరాళాలు ఇచ్చిన కంపెనీల షేర్లకు మంచి భవిష్యత్తు వున్నదని స్టాక్ మార్కెట్ విశ్లేషకులు ప్రచారం చేస్తారు. బాండ్ల ద్వారా గోప్యంగా విరాళాలిచ్చిన కంపెనీలు, విలువైన భూ కేటాయింపులను వీలైనంత చౌక ధరకు ఆశిస్తాయి. ప్రభుత్వ నిబంధనలు కఠినంగా వుండే ఫైనాన్స్ సేవలు, రియల్ ఎస్టేట్, మొదలగు రంగాలకు చెందిన కంపెనీలు నిబంధనల తొలగింపును ఆశిస్తాయి. వేలకోట్ల లాభాలున్న ప్రాజెక్టుల కేటాయింపులు, విరాళాలతో ఇవి ముడిపడి వుంటాయి. ఇందుకోసం దేశ ప్రజల బతుకులను సంక్షుభితం చేయడానికి ప్రభుత్వాలు వెనకాడవు. దోపిడీని కొనసాగించి, సంపదను, ఆధిపత్యాన్ని పెంచుకోవడానికి గుత్త కంపెనీలు పోటీపడి విరాళాలనిస్తాయి. ఎలక్టోరల్ ట్రస్టులను ఏర్పరచుకుంటాయి. అయినప్పటికీ విరాళాలను మరింతగా రాబట్టడానికి ఈడి, ఐటి, సిబిఐ సంస్థలతో కేంద్ర ప్రభుత్వం కంపెనీల మీద దాడులను చేయటం, ఆ కంపెనీలు వెనువెంటనే ఎలక్టోరల్ బాండ్లను కొన్న విషయాన్ని ఇండిపెండెంట్ మీడియా గ్రూప్ అధ్యయనం బయటపెట్టింది.

ఇండియన్ బుల్స్ సంస్థకు బీమా రంగంలో ప్రవేశం లభించింది. DLF కంపెనీ, అమెరికాకు చెందిన ఆస్థుల సంస్థ 'హైన్స్'తో మిలాఖత్ అయ్యి, గుర్‌గాం లో 11.76 ఎకరాల విలువైన భూమిలో కమర్షియల్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు నిర్మించడానికి అనుమతులు లభించాయి. భార్తీ ఎయిర్‌టెల్, తన మొబైల్ ఫోన్ మార్కెట్ వాటాను రిలయన్స్ జియోకు కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందే. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా దక్కిన ప్రతిఫలం ఏమిటంటే ఇన్‌ఫ్లైట్ మరియు మారిటైమ్ బ్రాడ్ బ్యాండ్‌ను విక్రయించడానికి 10 సం.లకు లైసెన్స్ లభించింది. 5,872 కోట్ల రూ॥ల డివిడెండ్ పంపిణీ తగాదా, పన్ను చెల్లింపులో తగాదాలున్న ఆదిత్య బిర్లా గ్రూపుకు చెందిన ది మైనర్ గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌కి సమస్య వుండదన్న హామీ లభించింది.

టోరెంట్ ఫార్మా, టోరెంట్ పవర్ సంస్థలకు అహ్మదాబాద్‌లో చదరపు గజానికి కేవలం 1.2 లక్షల రూ.లకు 28,000 చదరపు గజాల భూమి లభించింది. ప్రత్యేక మదుపు ప్రాంతం దోవేరాలో విద్యుచ్ఛక్తి పంపిణీకి లైసెన్స్ వచ్చింది. జన్‌హిత్ ఎలక్టోరల్ ట్రస్ట్, తూత్తుకుడికి చెందిన స్టెరిలైట్ కాపర్‌కి చెందిందని, 2018 లో 13 మంది పోలీసు కాల్పులలో చనిపోయిన ఉదంతం వల్ల ఈ కంపెనీ విరాళాలను ఆమోదించకూడదని ECI పదేపదే చెబుతున్నా, ఈ కంపెనీ విరాళాలను బిజెపి తీసుకున్నది. అత్యంత అధిక విరాళాలిచ్చిన జాబితాలో ఐదవ స్థానం వేదాంత లిమిటెడ్‌ది. రెండవ స్థానం మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌ది. ఈ కంపెనీ ప్రతిష్టాత్మకమైన జొజిల్లా టన్నెల్ డీల్‌ని పొందింది. ఇంకా జమ్ము, కాశ్మీర్‌లో ఆల్ వెదర్ రోడ్ టన్నెల్, ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు, తెలంగాణలో లక్ష కోట్ల రూపాయల విలువగల కాళేశ్వరం ప్రాజెక్టు, తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఎన్నో ప్రాజెక్టులను ఈ సంస్థ పొందింది. భూములను, ఖనిజాలను, ప్రభుత్వరంగ పరిశ్రమలను, వివిధ ప్రాజెక్టులను, మొత్తంగా సమస్త దేశ సంపదను గుత్త పెట్టుబడులకు అప్పజెప్పటానికి, లైసెన్సులను ఇవ్వటానికి, సంస్థలు చేసే నేరాలను మాఫీ చేయటానికి ఎలక్టోరల్ బాండ్లు బలమైన సాధనం అయినాయి. నయా ఉదారవాద విధానాలను బలంగా ప్రచారంచేసే గుత్త సంస్థల సమర్థత లోని డొల్లతనాన్ని ఎలక్టోరల్ బాండ్ల పథకం బయటపెట్టింది. పైకి ఒక పథకంగా కనిపించినా పాలకవర్గాలు తాము ఎదుర్కొంటున్న సంక్షోభానికి పరిష్కార మార్గంగా దీన్ని ముందుకు తెచ్చుకున్నాయి. కోర్టుల్లో తమకు ఎదురు వచ్చినప్పుడు, ప్రజల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలపై పూర్తిగా నమ్మకం పోతుందేమో ననుకున్నప్పుడు తాత్కాలికంగా వెనక్కు తగ్గుతున్నట్టు కనిపించి మరొక రూపంలో ముందుకు రావడం పాలకులకు కొత్తేమీ కాదు. మెజారిటీ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి తోసేస్తూ, కార్పొరేట్ శక్తుల ప్రయోజనం కోసమే పనిచేస్తూ, సమస్త దేశ సంపదలను గుత్త పెట్టుబడులకు స్వాధీనం చేసే ప్రభుత్వాలు రావటానికి ఎలక్టోరల్ బాండ్ల పథకం ఒక మార్గం అయింది. దీన్ని సుప్రీంకోర్టు రద్దు చేయటం హర్షించవలసిందే. కానీ, ప్రజల కోసమే పని చేసే నిజమైన ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఏర్పడాలంటే ప్రజల సంఘటిత పోరాటాలు తప్పనిసరి.

* * * * *